క్లుప్తంగా

15న సంస్మరణ సభ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పోలేపల్లి పోరాట యోధుడు మధుకాగుల సంస్మరణ సభ ఈనెల 15న నిర్వహించనున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ చౌరస్తాలోని ఎస్సీ కమ్యునిటీ హాల్ బుద్ధభవన్‌లో కార్యక్రమం ఉంటుందని లేబర్ సంఘం నాయకుడు గోపాల్‌మాదిగ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'రైతుబంధు' విడుదల చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతు బంధు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ చర్యలు చేపట్టలేదని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామిక వాదులు దీనిపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. వెంటనే డబ్బులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత

మిడ్జిల్: మున్ననూర్‌కి మాజీ ఉపసర్పంచ్ యాదిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం రూ. నాలుగు లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్థానిక నాయకుల ద్వారా బాధితుడికి శనివారం అందజేశారు. మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, సాయిలు, జంగయ్య, జైపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ అభ్యర్థులుగా బీసీలనే ప్రకటించాలి

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానానికి అన్ని పార్టీలు బీసీలనే అభ్యర్థులుగా ప్రకటించాలని బీసీసేన జిల్లా అధ్యక్షుడు యాదన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎమ్మార్పీ కార్యాలయం వద్ద సమావేశంలో మాట్లాడారు. బీజేపీ శాంతి కుమార్‌కు టికెట్ కేటాయించాలని అన్నారు. బీసీసేన ఆయనకు సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన శిబిరం

జడ్చర్ల టౌన్: సంస్కృత భారతి విభాగ్ ఆధ్వర్యంలో పట్టణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంస్కృత శిక్షణ శిబిరం ముగిసింది. మారుతినగర్ మాధవి భవన్‌లో శనివారం ముగింపు కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సంస్కృత భారతి విభాగ్ ప్రముఖులు వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణ, శిక్షకురాలు భాగ్యశ్రీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ పంపు చోరీ

జడ్చర్ల టౌన్: ఈర్లపల్లి పంచాయతీ ట్రాక్టర్ పంపు చోరీకి గురైంది. విషయంపై సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ట్రాక్టర్‌ను సర్వీసింగ్ నిమిత్తం శుక్రవారం ఈర్లపల్లి నుంచి గౌరిశంకర్ కాలనీలో తాను నివాసం ఉంటున్న ఇంటి వద్దకు తీసుకువచ్చానని సర్పంచ్ ఫిర్యాదులో పొందుపర్చారు. శనివారం తిరిగి గ్రామానికి తీసుకువెళ్లేందుకు యత్నించగా పంపు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): ప్రభుత్వ భవనమైన ఎంపీపీ కార్యాలయాన్ని రాజకీయాలకు వాడుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ కార్యాలయాన్ని రాజకీయ ప్రెస్‌మీట్‌కు వాడుకోవడంపై మండిపడ్డారు. వెంకటయ్య, వేముల కృష్ణయ్య, షబ్బీర్‌హుస్సేన్, జిల్లెల శేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిడ్జిల్: మండలపరిధిలోని వాడ్యాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో (2006–2007) పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్య, అబ్దుల్లా, కల్పన, సంగీత, పూర్వవిద్యార్థులు భీరయ్య, అనిల్, అంజాద్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అడ్డాకుల: గౌరిదేవిపల్లికి చెందిన యువతి(19) అదృశ్యమైనట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఈనెల 11న రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని, కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని అన్నారు. దీంతో యువతి తండ్రి శనివారం ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు



భూత్పూర్‌లో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత

భూత్పూర్: పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే సతీమణి జి. కవిత బహుమతులను అందజేశారు. అదేవిధంగా సంక్రాంతి పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా ఉపాధ్యక్షుడు వి. కురుమూర్తి నగదు బహుమతులు అందజేశారు. నాయకులు వెంకట్ నర్సింహారెడ్డి, గోవర్ధన్ గౌడ్, పద్మ, వెంకట్ నారాయణ, శ్రీను, జమీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పండగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని రంగారెడ్డిగూడ సర్పంచ్ శశికళ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీవేంకటేశ్వరకాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ ప్రజల్లో కొత్త కాంతిని నింపుతుందని అన్నారు. కాలనీవాసులకు క్రికెట్ కిట్ అందజేశారు. వార్డుకౌన్సిలర్ ప్రశాంత్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు నాగరాజు, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు. పోటీల్లో మానస, చంద్రకళ, భువనవాణి, ప్రేమలత విజేతలుగా నిలిచారు.

మిడ్జిల్: రాణిపేట్‌లో శనివారం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు మల్లేష్, శ్రీధర్, నాయకులు సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, జంగయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఇన్నెర కంపెనీ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర ఏజెన్సీస్ నిర్వాహకుడు ఎం.శ్రీహరిగౌడ్ శనివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. జలుగరి జ్యోతి, తోటపల్లి భవాని, తిరుపతమ్మ వేసిన ముగ్గులు బహుమతులకు ఎంపికయ్యాయి. మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణ, ఉప సర్పంచ్ తాజోద్దీన్, పోటీల నిర్వాహకుడు శ్రీహరిగౌడ్, మండ్ల కురుమూర్తి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శెట్టిశ్రవణ్, నారాయణ, బల్లె వంశీ, నరేష్, సతీష్, శ్రీను, ధనుంజయ ఉన్నారు.



మూసాపేటలో..



దివిటిపల్లిలో..

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని దివిటిపల్లిలో గల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ జరీనాబేగం బహుమతులు అందజేశారు. నాయకులు మోహన్, కిల్లె గోపాల్, ఎ.రాములు, చంద్రకాంత్, మల్లెల మాణిక్యంరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.



భూత్పూర్‌లో..



రాణిపేట్‌లో..



జడ్చర్లలో..

సమాజ నిర్మాణంలో స్త్రీలపాత్ర గొప్పది



సదస్సులో ప్రసంగిస్తున్న రెవరెండ్ డాక్టర్ జాయ్ చెరియన్

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ నిర్మాణంలో స్త్రీల పాత్ర గొప్పదని హైదరాబాద్ రాంనగర్‌లోని యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఫౌండర్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జాయ్ చెరియన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో శనివారం కల్వరి ఎంబీ సంఘం–స్త్రీల సమాజం ఆధ్వర్యంలో ఒక్కరోజు స్త్రీల రిట్రీట్ (సదస్సు)నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ జాయ్ చెరియన్ ప్రసంగించారు. పిల్లలు సమాజంలో ఇతరుల పట్ల ఏ విధంగా గౌరవంగా మెలగాలో, సమాజం పట్ల వారికున్న బాధ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో స్త్రీలకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఏ జేకబ్, కార్యదర్శి జేఏ డేవిడ్, కోశాధికారి టీఏ.స్టీవెన్, ఇమ్మాన్యుయెల్ రాజు, స్త్రీల సమాజం ప్రతినిధులు ఎం.నిస్సీ నిరవంజని సుధీర్, బీపీ.లిడియా యోహాన్, పి.భాగ్యమ్మా మరియన్, దెబోరా సామ్యేల్, అరుణా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రజట్టు కోచ్ నర్సింహకు సన్మానం



నర్సింహతో రమేశ్‌బాబు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు కోచ్ నర్సింహను స్థానిక మెయిన్ స్టేడియంలో శనివారం పలువురు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు నర్సింహను అభినందించారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, ఉపాధ్యక్షుడు అనిల్, బాల్‌రాజు, అహ్మద్ హుస్సేన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కూడళ్లు



జడ్చర్లలో ప్రయాణికుల రద్దీ

జడ్చర్ల టౌన్: సంక్రాంతి సంబరాలు ఆరంభం కావటంతో పట్టణంలోని ముఖ్య కూడళ్లన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా జడ్చర్ల కొత్తబస్టాండ్ శనివారం మధ్యాహ్నం వరకు ప్రయాణికుల రద్దీతో నిండిపోయింది. ఆయా ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వెళ్లేవారితోపాటు పట్టణం నుంచి స్వగ్రామాలకు వెళ్లే వారితో బస్టాండ్ నిండిపోయింది. నాగర్‌కర్నూలు, కొల్లాపూర్, వనపర్తి డిపోల బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

కొనసాగుతున్న అక్షతల పంపిణీ



అక్షతలు పంపిణీ చేస్తున్న డీకే అరుణ

రాజాపూర్: మండలపరిధిలోని గ్రామాల్లో అయోధ్యరాముడి అక్షతల పంపిణీ కొనసాగుతోంది. శనివారం రంగారెడ్డిగూడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. శివప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, రాములుగౌడ్, వెంకటేష్, శివకుమార్, నర్సింహ్మాచారి పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): రామ మందిర నిర్మాణం దేశ పురోభివృద్ధికి సంకేతమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. శనివారం హన్వాడ మండల కేంద్రంలో అక్షతల వితరణ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. నాయకులు దాసరి కేశవులు, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, కొండా బుచ్చారెడ్డి, కొండా బాలయ్య, మామిడిమాడ వెంకటయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని కోయిల్‌కొండ, చిన్నలింగల్‌ఛేడ్ గ్రామాల్లో శనివారం అక్షతల పంపిణీ నిర్వహించారు. అంతకుముందు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రఘురామాచారీ, డీఎం రాఘవేందర్‌రావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జిల్లాకేంద్రంలో విజేత జట్టుతో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు



నవాబుపేటలో...



సేరిగూడలో..

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని ఎండీసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ ఎస్ఎస్‌యూఐ జట్టు–హన్వాడ–2 జట్ల మధ్య జరిగింది. ఎస్ఎస్‌యూఐ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. టోర్నీ బహుమతుల ప్రదానోత్సవంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

బాలానగర్: గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని సర్పంచ్ శంకరప్ప అన్నారు. శనివారం పెద్దాయపల్లి పరిధి సేరిగూడ గ్రామంలో ఎస్‌పీఎల్–3 పోటీలను ప్రారంభించారు. వేణు, లింగం, రఫీ పాల్గొన్నారు.

నవాబుపేట: గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం మరింతగా కృషి చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. శనివారం నవాబుపేటతో పాటు కొల్లూర్, పుట్టోనిపల్లితండా, చౌడూర్, హాజిలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన విలేజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, సౌజన్య, నర్సింహనాయక్, కాంగ్రెస్ మండల అధక్ష్యుడు రాంచంద్రయ్య, యూత్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమవుతున్నా పట్టింపేది..?



కొత్తపల్లిలో రైతువేదిక అద్దాలను పగలగొట్టిన దుండగలు

మాగనూర్: పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు నిర్మించిన రైతువేదికలు అధికారులు పర్యవేక్షణ లోపంతో విలువైన వస్తువులు ధ్వంసమవుతున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు వేల హెక్టార్లకు ఒక్కొక్క క్లస్టర్ చొప్పున ఆయా క్లస్టర్ల వారిగా రూ. లక్షలు ఖర్చు చేసి రైతు వేదికలను నిర్మించారు. వివరాల్లోకి వెళ్లితే.. మండల పరిధిలోని కొత్తపల్లిలో నిర్మించిన రైతు వేదిక భవనంలోని విలువైన వస్తువులను దుండగలు ధ్వంసం చేశారు. దీంతో రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన రైతు వేదికలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమాచారహక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ జిల్లా నూతన కమిటీని శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగెండ్ల వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన సభ్యులను ఎన్నుకుని ప్రమాణపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడిగా దినేష్‌వర్మ, ఉపాధ్యక్షుడిగా చిన్నయ్య, కార్యదర్శిగా కిరణ్, సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా మాధవ్, నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎల్ల కుర్మయ్యలను నియమించారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. సమాచారహక్కు చట్టం సామాన్య ప్రజలకు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కమిషనర్‌ను నియమించి ఆర్‌టీయాక్ట్‌ను కాపాడాలన్నారు.

'డబుల్' ఇళ్ల గోల!



నవాబుపేటలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూంలు

- కొన్నిచోట్ల పంపిణీలో ఆలస్యం
- మరికొన్ని చోట్ల అసంపూర్తిగా నిర్మాణాలు
- స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసిన ఆశావహులు

నవాబుపేట: మండలపరిధిలో 'డబుల్' ఇళ్ల పంపిణీలో సందిగ్ధం నెలకొంది. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయిన పంపిణీలో ఆలస్యం జరగడం.. పట్టాల అందజేతలో జాప్యం, మండల కేంద్రంలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడం వంటి పరిస్థితి కనిపిస్తోంది. వీటికితోడు కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో ఆయా గ్రామాల్లో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆయాచోట్ల నిర్మించిన ఇళ్లను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు.

పరిస్థితి ఇలా..

నవాబుపేట పరిధిలో గత ప్రభుత్వం మండల కేంద్రంతో పాటు మరో మూడు గ్రామాల్లో డబుల్ ఇళ్లను నిర్మించింది. కాగా మండల కేంద్రంలో వంద ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినప్పటికీ రెండేళ్ల క్రితమే అసంపూర్తిగా వదిలేశారు. రుద్రారంలో 24 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు గత ఏడాది అందించారు. తీగలపల్లిలో సైతం ఇళ్లలో లబ్ధిదారులు ఉన్నా వారికి మంజూరు పత్రాలు ఇంకా అందించలేదు. పట్టాలు అందించటంలో జాప్యం కొనసాగుతునే ఉంది. యన్మన్‌గండ్లలో 48 ఇళ్లు నిర్మించగా గత ఏడాది ప్రారంభించారు. కానీ లబ్ధిదారులకు అందించలేదు. ఇళ్ల కోసం గ్రామానికి చెందిన 159 మంది దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. దీంతో లబ్ధిదారులకు సొంతింటి కల నేటికీ కలగానే మిగిలింది.

ఇళ్ల స్వాధీనానికి యత్నం

ఇదిలా ఉండగా పలుచోట్ల ఇళ్లు కేటాయించకపోవడంతో ఆగ్రహం చెందిన నిరాశ్రయులు తమ తమ గ్రామాల్లో నిర్మించిన వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడం గమనార్హం. ఇటీవల యన్మన్‌గండ్లలో ఏకంగా ఇళ్లకు తాళాలు వేసుకుని ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని వారిని బయటికి పంపించారు. కాగా అంతకుముందు జడ్చర్ల పరిధిలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పంపిణీ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే కేటాయించాలి



మాకు ఉండటానికి ఇల్లు లేదు. ఐదేళ్లుగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం. గత ఏడాది దరఖాస్తు చేసుకున్నాం. ఈలోపే ఎన్నికలు వచ్చాయని ఇల్లు ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వం రావటంతో నిబంధనలు మారాయని అంటున్నారు. వెంటనే ఇల్లు కేటాయించి ఆదుకోవాలి.

– కనెమోని రమాదేవి, యన్మన్‌గండ్ల

అక్రమంగా ఉంటే చర్యలు



మండలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను జిల్లా హౌసింగ్ అధికారికి అప్పగిస్తాం. అనంతరం వారు కొత్త నిబంధనల ప్రకారం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తారు. యన్మన్‌గండ్ల, తీగలపల్లి గ్రామాల్లో నిర్మించిన ఇళ్లలోకి ఎవరూ వెళ్లరాదు. వాటిని నిబంధనల ప్రకారం కేటాయిస్తారు. అక్రమంగా ఇళ్లలో ఉంటే చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున్‌రావు, తహసీల్దార్, నవాబుపేట

హౌసింగ్ బోర్డు ఏర్పాటు తరువాతే!

గత ప్రభుత్వం హౌసింగ్ బోర్డును రద్దు చేసి సొంతిటి కలల కోసం రెండు గదుల నిర్మాణం చేపట్టింది. కాగా వాటిని ఇంకా చాలాచోట్లు అందించలేదు. ఈ క్రమంలోనే తాజాగా కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరింది. దీంతో హౌసింగ్ బోర్డు ఏర్పాటుకు కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బోర్డు ఏర్పాటు చేసిన అనంతరమే 'డబుల్' ఇళ్ల పంపిణీ జరిగే అవకాశం ఉందని సమాచారం. ఇదే జరిగితే లబ్ధిదారులు మరిన్ని రోజులు వేచి చూడాల్సి ఉంటుంది.